## క్లుప్తంగా

### కార్మికులకు దుస్తుల పంపిణీ

ధన్వాడ: మండలంలోని పంచాయతీ కార్యాలయంలో బుధవారం పంచాయతీ సిబ్బందికి యూనిఫాంలు అందజేశారు. ఈ మేరకు.. ఎంపీడీఓ సాయి ప్రకాష్ మాట్లాడుతూ.. పంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందికి రెండు జతల చొప్పున ఏకరూప దుస్తులను పంపిణీ చేసినట్లు తెలిపారు. అలాగే మందిపల్లి గ్రామ పంచాయతీలో కూడా సిబ్బందికి పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

### తహసీల్దార్‌కు సన్మానం

ఊట్కూరు: మండలంలోని నూతనంగా విధుల్లో చేరిన తహసీల్దార్ రవికి బుధవారం పెద్దజట్రం గ్రామస్తులు ఆహ్వానం పలికారు. అనంతరం తహసీల్దార్‌కు పూలమొక్కను అందజేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు వీరరాఘవరెడ్డి, కనకప్ప, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### డ్రగ్స్‌పై వ్యాసరచన పోటీలు

మాగనూర్: డ్రగ్స్ మహమ్మారిని సమాజం నుంచి పారద్రోలాలనని ఆలోచనతో బుధవారం మండలంలోని విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ మేరకు.. డ్రగ్స్‌తో కలిగే నష్టాలతోపాటు వాటిని విక్రయించిన వారిపై తీసుకొనే చర్యలు, శిక్షల గురించి వ్యాసరచనలో విద్యార్థులకు తెలియజేయాలనే ఆలోచనతో ఈ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు దినచర్య పుస్తకాల అందజేత

కోస్గి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి కోసమే ప్రభుత్వం దినచర్య పుస్తకాల పంపిణీ కార్యక్రమం చేపట్టిందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం మండల పరిధిలోని సర్జఖాన్‌పేట జెడ్పీ ఉన్నతపాఠశాలలో అదనపు తరగతిగదిని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. రాష్ట్రంలో పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలోని సర్జఖాన్‌పేట జెడ్పీ పాఠశాలను ఎంపిక చేసినట్లు హెచ్‌ఎం తెలిపారు. ప్రభుత్వం నుంచి మంజూరైన దినచర్య పుస్తకాలను విద్యార్థులకు పంపిణీ చేశారు. అంతకుముందు విద్యార్థులు అధికారులకు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం కృష్ణగౌడ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

### ఎన్‌సీసీ ఉపాధ్యాయుడిని నియమించాలి

ఊట్కూరు: మండలంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఎన్‌సీసీ ఉపాధ్యాయుడిని నియమించాలని కోరుతూ బుధవారం సెక్టోరియల్ అధికారి శ్రీనివాసులుకు గ్రామస్తులు వినతి పత్రం అందించారు. ఈ మేరకు.. మాజీ సర్పంచ్ భాస్కర్ మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరం ఎన్‌సీసీ ఉపాధ్యాయుడిని నియమించకపోవడంతో విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారని ఆయన తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి ఎన్‌సీసీ ఉపాధ్యాయుడిని నియమించాలని కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్ గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అరవింద్‌కుమార్, మాజీ ఎంపీటీసీ హన్మంతు, భరత్‌కుమార్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### వివాహిత అదృశ్యం


జ్యోతి(ఫైల్)

కోస్గి: పుట్టింటికొచ్చిన ఓ వివాహిత అదృశ్యమైన ఘటనపై పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఎస్‌ఐ బీటీ రమణ వివరాల మేరకు.. మద్దూరు మండలం దోరెపల్లికి చెందిన జ్యోతి అలి యాస్ లక్ష్మి వారంరోజుల క్రితం తనతల్లిదండ్రుల గ్రామమైన మున్సిపల్ పరిధిలోని సంపల్లికి వచ్చింది. ఈ క్రమంలో ఈ నెల 13న ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికిన ఫలితం లేకపోవడంతో బుధవారం ఆమె తండ్రి లక్ష్మయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు వివాహిత అదృశ్యంపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. వివరాలు తెలిస్తే సీఐ 8712670384నంబర్‌కు గాని, ఎస్‌ఐ 8712670406కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

### బారికేడ్స్ అందజేయడం అభినందనీయం



మరికల్: జాతీయ రహదారిపై జరుగుతున్న ప్రమాదాల నివారణకు మండల ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ వారు బారికేడ్స్‌ను అందజేయడం వారి సేవలు అభినందనీయమని సీఐ రాజేందర్‌రెడ్డి, ఎస్‌ఐ మురళి అన్నారు. బుధవారం మండలంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో సీఐ, ఎస్‌ఐ సమక్షంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వారు రూ. లక్ష విలువ చేసే పది బారికేడ్స్‌ను పోలీసులకు అందజేశారు. అనంతరం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాన్ని సీఐ, ఎస్‌ఐలు అభినందించారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం పాల్గొన్నారు.

# రోల్ మోడల్‌గా నిలవాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి

నారాయణపేట: జిల్లాలోని మెడికల్ కళాశాల రాష్ట్రంలోనే రోల్ మోడల్‌గా నిలవాల ని కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే డా.చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. బుధవారం మెడికల్ కళాశాలలో ప్రిన్సిపాల్ డా.రాంకిషన్ అధ్యక్షతన లెటర్ ఆఫ్ పర్మిషన్ సెలబ్రేషన్స్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరై జ్యోతి ప్రజ్వలన, కేక్ కట్ చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. తాను కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన కొన్ని వారాలకే నేషనల్ మెడికల్ కౌన్సిల్ బృందం మెడికల్ కళాశాలను పరిశీలించినట్లు తెలిపారు. మెడికల్ కళాశాల ఏర్పాటులో గత కలెక్టర్ కోయ శ్రీహర్ష, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, ప్రిన్సిపాల్ రాంకిషన్ కృషి ఎంతో ఉందన్నారు. కళాశాలలో చేరబోయే మొదటి సంవత్సరం విద్యార్థులకు, కళాశాల ఏర్పాటుకు సమష్టిగా కృషిచేసిన ప్రజాప్రతినిధులు అధికారులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అందరి సమిష్టి కృషితో మెడికల్ కళాశాల నిర్మాణం త్వరగా పూర్తయి, ఎల్‌ఓపీ వచ్చిందన్నారు. మెడికల్ కళాశాలతో జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.డీఎంహెచ్‌ఓ సౌభాగ్యలక్ష్మి, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె అనసూయ, వైస్‌చైర్మన్ హరి నారాయణ బట్టాడ్, ఐఎంఏ అధ్యక్షుడు డా. మల్లికార్జున్, ఆర్‌ఎంఓ పావని పాల్గొన్నారు.

**సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ**

పట్టణంతో పాటు దామరగిద్ద, కోయిలకొండ, ధన్వాడ, మండలాలకు చెందిన సుమారు 200మంది లబ్ధిదారులకు జిల్లా కేంద్రంలోని సీవీఆర్ భవన్‌లో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ మేరకు.. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ద్వారా వచ్చే సంక్షేమ పథకాలు ప్రతి నిరుపేద కుటుంబానికి అందాలనే ఆశయంలో తాము పనిచేస్తున్నామన్నారు. అభివృద్ధిలో తనకు అండగా నిలవాలని ప్రజలను కోరారు.

**కాంగ్రెస్‌లో చేరిక..**

ధన్వాడ మండలం మందిపల్లి గ్రామానికి చెందిన వందమంది బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు జిల్లా కేంద్రంలోని సీవీఆర్ భవన్‌లో ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి ఎమ్మెల్యే పార్టీలోకి ఆహ్వానించారు. వివిధ మండలాల అధ్యక్షుడు నరహరి, బాల్‌రెడ్డి, రవీందర్, విద్యాసాగర్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం, బండి వేణుగోపాల్, గందె చంద్రకాంత్, మనోహర్ గౌడ్, మహిపాల్ రెడ్డి, అమీరుద్దీన్ పాల్గొన్నారు.

## అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధే లక్ష్యం


భవన ప్రారంభోత్సవంలో ప్రత్యేకాధికారితో తిరుపతిరెడ్డి, తదితరులు

కోస్గి: కోడంగల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా రూపురేఖలు మార్చడమే లక్ష్యమని కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం కోస్గి, గుండుమాల్ మండలాల పరిధిలో పలు నూతన భవనాలను ప్రారంభించడంతోపాటు పలు అభివృద్ధి పనులకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కోస్గి పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నూతనంగా నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించారు. అనంతరం చంద్రవంచలో సబ్‌స్టేషన్, సర్జఖాన్‌పేటలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో అదనపు తరగతి గదులు, ముంగిమళ్ల టూ లోదిపూర్ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. గుండుమాల్ మండలంలోని బోగారం, అమ్లికుంట్ల, భక్తిమళ్ల గ్రామాల్లో పంచాయతీ భవనాలు, అప్పాయపల్లి తాండ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీధర్, మున్సిపల్ చైర్‌పర్సన్ కోడిగంటి అన్నపూర్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు భీంరెడ్డి, భానునాయక్, ఇద్రీస్, శ్రీను, బాలేష్, వార్ల విజయ్‌కుమార్, మండల అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, విక్రంరెడ్డి, బెజ్జు రాములు, తుడుం శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మావోయిస్టుల ఘాతుకానికి 19 ఏళ్లు

- దాడిలో నాటి మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డితో పాటు 10 మంది మృతి


మావోయిస్టుల దాడిలో మృతిచెందిన ఎమ్మెల్యే, ఇతరుల మృతదేహాలు (ఫైల్)

నారాయణపేట: పంద్రాగస్టు వచ్చిందంటే చాలు.. 2005లో జిల్లాకేంద్రంలో స్వాతంత్ర్య దినోత్సవం రోజున జరిగిన మావోయిస్టుల ఘాతుకం ప్రతి ఒక్కరి మదిని కలిచివేస్తోంది. ఈ ఘటనలో నాటి మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డితో పాటు ఆయన తనయుడు చిట్టెం వెంకటేశ్వర్‌రెడ్డి, తొమ్మిది మంది తుపాకీ తూటాలకు బలయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. పంద్రాగస్టు రోజున స్వాతంత్ర్య వేడుకలు ముగిసిన అనంతరం మధ్యాహ్నం 1.25 గంటల ప్రాంతంలో పట్టణంలోని హరిజనవాడలో ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి పక్కనే ఉన్న ఆంజనేయస్వామి ఆలయం ప్రాంతంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించేందుకు కొబ్బరికాయ కొడుతున్నారు. ఆ ప్రాంతంలో అప్పటికే మాటేసిన మావోయిస్టులు ఒక్కసారిగా ఏకే-47తో కాల్పులు జరిపారు. ఆ ఘటనలో ఎమ్మెల్యేతో పాటు ఆయన తనయుడు వెంకటేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ డీవీ రామ్మోహన్, గన్‌మెన్ రాజారెడ్డి, ఎమ్మెల్యే కారు డ్రైవర్ శ్రీనివాసులు, ఆర్డీఓ కార్యాలయం అటెండర్ సాయిబన్న, మాగనూర్ మండల యూత్ కాంగ్రెస్ నాయకుడు లోకేశ్వర్‌రెడ్డి, ఊట్కూర్ మండలం తిప్రాస్‌పల్లికి చెందిన కాంగ్రెస్ నాయకుడు మోనప్పగౌడ్, రవీందర్‌గౌడ్ మృతిచెందారు. కొద్దిరోజుల వ్యవధిలోనే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నారాయణపేటకు చెందిన దూడం విజయ్‌కుమార్, చిట్టెం వెంకటేశ్వర్‌రెడ్డి కారు డ్రైవర్ ఆరీఫ్ చనిపోయారు. ఆర్డీఓ శివారెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్‌రెడ్డి, దివంగత ఘన్‌శ్యాందాస్ధరక్, ఎమ్మెల్యే పీఏ భాస్కర్, అవుటి రాజశేఖర్, నాగేందర్, లొట్టి శ్రీనివాస్, సూరి గాయాలపాలయ్యారు.

- **వైఎస్సార్ దిగ్భ్రాంతి..**

సమాచారం తెలుసుకున్న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డితో పాటు పీసీసీ అధ్యక్షుడు కేశవరావు, ఎంపీ జైపాల్‌రెడ్డి ప్రత్యేక హెలికాప్టర్‌లో అదేరోజు సాయంత్రం నారాయణపేటకు చేరుకొని ప్రభుత్వ ఆస్పత్రిలో ఎమ్మెల్యే, ఇతరుల మృతదేహాలను చూసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ ఘటన నేపథ్యంలో రాష్ట్రంలో మావోయిస్టులపై నిషేదం కొనసాగింది. బాధిత కుటుంబ సభ్యులకు నాటి ముఖ్యమంత్రి విద్యార్హత ఆధారంగా ప్రభుత్వ ఉద్యోగాలిచ్చారు. చిట్టెం వెంకటేశ్వర్‌రెడ్డి సతీమణి చిట్టెం లక్ష్మికి ఆర్డీఓ పోస్టు కేటాయించారు. ప్రస్తుతం ఆమె ఐఏఎస్ హోదాలో కొనసాగుతున్నారు. చిట్టెం నర్సిరెడ్డి మనువరాలు, చిట్టెం వెంకటేశ్వర్‌రెడ్డి కుమార్తె డా. చిట్టెం పర్ణికారెడ్డి నారాయణపేట ఎమ్మెల్యేగా, చిట్టెం నర్సిరెడ్డి కుమార్తె డీకే అరుణ మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలిగా కొనసాగుతున్నారు.

## ఇంటింటిపై జాతీయ జెండా ఎగరాలి



నర్వ: ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఆవిష్కరించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బీజేపీ పార్టీ గ్రామ బూత్ లెవెల్ అధ్యక్షులు, మండల నాయకులకు జాతీయ జెండాలను అందించారు. అనంతరం మాట్లాడుతూ.. హర్.. ఘర్.. తిరంగ్ కార్యక్రమంలో భాగంగా దేశ వ్యాప్తంగా ప్రజల్లో దేశభక్తి, జాతీయ భావం పెంపొందించేందుకు బీజేపీ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. గురువారం ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి సెల్యూట్ చేయాలన్నారు. బీజేపీ మండల, గ్రామ పార్టీ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## బాల్యవివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దుదాం

నారాయణపేట: నారాయణపేటను బాల్యవివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. కలెక్టర్ చాంబర్‌లో బుధవారం బచ్పన్ బచావో ఆందోళన్ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ అందె వెంకటేశ్వర్లుతో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని కౌమారదశ బాలలను గుర్తించడంతో పాటు బడిబయట ఉన్న బా లలను పాఠశాలల్లో చేరిపించాలని అధికారులకు సూచించారు. బాలల హక్కులపై అందరికీ అవగాహన ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా సంక్షేమాధికారి జయ ఉన్నారు.

## విరాళాల సేకరణ

నారాయణపేట రూరల్ : కేరళ వరద బాధితులకు ప్రతి ఒక్కరూ అండగా నిలుద్దామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నరహరి అన్నారు. ఆ సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని శ్రీహంసవాహిని స్కూల్, స్ఫూర్తి డిగ్రీ, బాబు జగ్జీవన్‌రాం ఒకేషనల్ కళాశాలల్లోని విద్యార్థులు, ఉపాధ్యాయుల నుంచి బుధవారం విరాళాలను సేకరించారు. వారు మాట్లాడుతూ.. ఎవరూ ఊహించని విపత్తుకు కేరళ రాష్ట్ర తీర ప్రాంతాలు భయానిక పరిస్థితి నెలకొందని, వారికి అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విరాళాలను సీఎం రిలీఫ్‌ఫండ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. భానుప్రకాష్, వెంకటేష్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## దుండగుడిని కఠినంగా శిక్షించాలి


మాట్లాడుతున్న విజయలక్ష్మి

నారాయణపేట: వైద్య కళాశాల విద్యార్థినిని హత్య చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని (పీఓడబ్ల్యూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి విజయలక్ష్మి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ డిమాండ్ చేశారు. కలకత్తాలో జరిగిన వైద్య విద్యార్థిని హత్యను నిరసిస్తూ (పీఓడబ్ల్యూ) ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) సంఘాల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని స్థానిక చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ మేరకు వారు మాట్లాడారు.. కలకత్తాలోని ఆర్జీకార్ ప్రభుత్వ వైద్యకళాశాలలో విధుల్లో ఉన్న జూనియర్ వైద్యురాలిపై అత్యాచారం చేసి హత్యచేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలన్నారు. దుండగులను శిక్షించకుంటే దేశవ్యాప్తంగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామన్నారు. పీఓడబ్ల్యూ నాయకులు సునీత, సత్యమ్మ, భారతమ్మ, కళావతి, హరిత, జిల్లా సహాయ కార్యదర్శి వెంకటేష్, నాయకులు నవీన, అరుణ, లావణ్య, లక్ష్మి, అనూష, రాజు, ప్రశాంత్ పాల్గొన్నారు.

## ధనలక్ష్మీదేవి విగ్రహ ప్రతిష్ఠాపన



నర్వ: మండలంలోని ఉందేకోడ్‌లో ధనలక్ష్మీదేవి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజులపాటు ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వేదమంత్రోచ్చారణల మధ్య 108 కలశాలతో పంచామృతాభి షేకం, యంత్ర ప్రతిష్ఠాపన, అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

**ఘనంగా భ్రమరాంబ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన..**

నారాయణపేట: మండలంలోని ఆశన్‌పల్లిలో ఆలయంలో మూడు రోజులు పాటు నిర్వహించిన భ్రమరాంబ దేవి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో ముగిశాయి. సామూహిక అభిషేకం, యంత్రపూజ, స్థలశుద్ధి విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టారు. కార్యక్రమంలో సిద్ధలింగ శివాచార్యస్వామి, ఆలయ కమిటీ సభ్యులు ఉత్సవ నిర్వాహకులు పాల్గొన్నారు.

# అనుమానమే పెనుభూతమై..

- భార్యను హత్య చేసి భర్త బలవన్మరణం
- వివాహేతర సంబంధమే కారణమని ఆరోపణ
- నారాయణపేట జిల్లా ముడుమాల్‌లో విషాదం


తిమ్మప్ప, కావ్య (ఫైల్)

కృష్ణా: వివాహం జరిగి నాలుగు నెలలు కాక ముందే భార్యపై అనుమానంతో క్షణికావేశానికి లోనై.. భార్యను కత్తితో పొడిచి.. భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషాదకర సంఘటన నారాయణపేట జిల్లా కృష్ణా మండలం ముడుమాల్‌లో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణా మండలంలోని ముడుమాల్‌కు చెందిన తిమ్మప్ప(26)కు కర్ణాటకలోని బాడియాల్ గ్రామానికి చెందిన కావ్య(22)తో నాలుగు నెలల క్రితం వివాహమైంది. కాగా కొన్ని రోజులుగా భార్య ప్రవర్తనపై అనుమానం వచ్చిన తిమ్మప్ప ఆమె వాడుతున్న ఫోన్‌ను పరిశీలించగా అందులో ఉన్న ఓ యువకుడు ఎవరని నిలదీశాడు. ఈ విషయమై అనుమానం పెంచుకున్న తిమ్మప్ప బుధవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో భార్యతో గొడవ పెట్టుకున్నాడు. ఈ క్రమంలోనే క్షణికావేశానికి లోనై కోపంతో భార్య మెడపై, పొట్టలో కత్తితో పొడిచాడు. దీంతో ఆమె రక్తం మడుగులో పడిపోగా.. తిమ్మప్ప సైతం ఇంట్లో ఉన్న ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టుపక్కల వారు, కుటుంబ సభ్యులు గమనించి కొన ఊపిరితో ఉన్న కావ్యను రాయచూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. అయితే కావ్య కుటుంబానికి వారి గ్రామంలో మంచి పేరు ఉందని, ఆ అమ్మాయికి వివాహేతర సంబంధం లేదని బాడియాల్ గ్రామస్తులు చెబుతున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఎండీ నవీద్ తెలిపారు. తిమ్మప్ప మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఏది ఏమైనా పెళ్లి జరిగిన నాలుగు నెలలకే ఓ యువ జంట మృతితో రెండు కుటుంబాల్లో విషాదం నింపింది.

## నీటి సమస్య తీర్చిన దాతకు సన్మానం



మరికల్: మండలంలోని పెద్దచింతకుంట పంచాయతీ కార్యాలయంలో వాటర్ ప్లాంట్‌ను మరమ్మతు చేయించి నీటి సమస్యను తీర్చిన సూర్యచంద్ర ఫౌండేషన్ అధినేత సూర్యమోహన్‌ను బుధవారం గ్రామస్తులు సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. తమ సంస్థ నుంచి రూ. 32వేలు కేటాయించి నూతన పరికరాలు ఏర్పాటుచేసి సమస్యను తీర్చినట్లు తెలిపారు.

# హిందువులపై దాడులకు నిరసనగా ర్యాలీ


ఊట్కూరులో రాస్తారోకోలో మాట్లాడుతున్న నాయకులు


మరికల్‌లో..

ఊట్కూరు: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ బుధవారం మండలంలోని హిందూధార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బంద్ చేపట్టారు. యువకులు ఉదయం నుంచి హోటల్, దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేశారు. హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి చెక్‌పోస్ట్ వద్ద ప్రధాన రహదారిపై గంటపాటు ధర్నా చేపట్టారు. ఈ మేరకు.. పలువురు నాయకులు మాట్లాడారు.. హిందువులపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ అరవింద్‌కుమార్, శాంతానంద్‌పురోహిత్, మాజీ సర్పంచ్ భాస్కర్, భరత్‌కుమార్, వెంకటనారాయణ, రఘువీర్, కేశవరావు, శ్యాంలాల్ పాల్గొన్నారు.

మరికల్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ హిందు ధార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం బంద్‌కు నిర్వహించారు. అనంతరం విద్యార్థులచే భారీ ర్యాలీ నిర్వహించి చౌరస్తాలో రాస్తోరోకో చేశారు. ధార్మిక సంస్థ సభ్యులు రాజేష్, విజయ్‌కుమార్‌రెడ్డి, శేఖర్, మల్లేష్, రాములు, నరేష్‌గౌడ్, దేవేందర్‌గౌడ్, రమేష్, సాయితేజ, రాజు, హన్మిరెడ్డి పాల్గొన్నారు.

ధన్వాడ: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ మండల కేంద్రంలో స్వచ్ఛందంగా బంద్ నిర్వహించారు. ఈ మేరకు.. హిందు వాహిని జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ మాట్లాడుతూ.. హిందువులంతా సంఘటితమై హిందువులపై జరుగుతున్న దాడులను ఖండించాలన్నారు. కార్యక్రమంలో యువకమండలి సభ్యులు, హిందు వాహిని కార్యకర్తలు పాల్గొన్నారు.

మాగనూర్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు అరికట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం హిందు సంఘాల ఆధ్వర్యంలో మండలంలో బంద్ నిర్వహించారు. ఆయా హిందు సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ఘనంగా రక్షా బంధన్

మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం పాఠశాలలో ఘనంగా రక్షా బంధన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకొని రక్షా బంధన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.